క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బోథ్: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బోథ్ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కి వినతిపత్రం అందజేశారు. గురువారం హైదరాబాద్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. బోథ్ ఎక్స్‌రోడ్ నుంచి బోథ్ వరకు రోడ్డు నిర్మాణం, పోచ్చెర నుంచి బోథ్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే బోథ్ పట్టణంలోని కొన్ని ముఖ్యమైన ప్రదేశాల్లో హైమాస్ట్ లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మెరుగు భోజన్న, కుర్మే మహేందర్, అడేపు కిరణ్, భీమ గంగమల్లు, మాసం అనిల్ కుమార్ పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో అడ్మిషన్లు

బోథ్: తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో అడ్మిషన్ల కోసం ఈనెల 24న బోథ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు బోథ్ మండల విద్యాధికారి భూమా రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎనిమిది నుంచి తొమ్మిది సంవత్సరాలు ఉండి, 1, సెప్టెంబర్, 2015 నుండి 31, ఆగష్టు, 2016 మధ్యన జన్మించి ఉండాలని అన్నారు. ఆసక్తి గల విద్యార్థులు బోనా ఫైడ్, పాస్ ఫొటోతో రావాలన్నారు.

ఇచ్చోడ: ఈనెల 22న నాల్గో తరగతి విద్యార్థులకు క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పోటీల కన్వీనర్ ఎంఈవో రాథోడ్ ఉదయ్‌రావు గురువారం తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇచ్చోడ, సిరికొండ మండలాల విద్యార్థులు హాజరు కావాలని కోరారు. విద్యార్థులు పాఠశాల నుంచి బోనాఫైడ్, ఆధార్ కార్డును వెంట తీసుకురావాలన్నారు.

సన్మానం

బోథ్: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ రాకేశ్ విధుల్లో చేరిన సందర్భంగా గురువారం పలువురు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. మహిళల అభివృద్ధికి నావంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్, గడ్డల నారాయణ, వంశీ, సందీప్ పాల్గొన్నారు.

తాంసి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు సంతోష్ కుమార్, సుజాత, పవన్ కుమార్, అమరెందర్‌లను తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు గురువారం ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా విద్యార్థుల ఉపన్యాసాలు, సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో శ్రీకాంత్, మాజీ సర్పంచ్ కృష్ణ, రామన్న యాదవ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రంజన, ఉమా మహేశ్వర్ పాల్గొన్నారు.

అంబేద్కర్‌కాలనీకి తాగునీటి సరఫరా



నీటి సరఫరాను పరిశీలిస్తున్న అధికారి

నార్నూర్: మండల కేంద్రంలోని అంబేద్కర్ ఎస్సీ కాలనీలో నెల రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడం ఇటీవల కాలనీవాసులు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్ కాలనీని గురువారం కాలనీల్లో పర్యటించారు. పంచాయతీ కార్యదర్శి అనురాగ్‌తో కలిసి మిషన్ భగీరథ పైప్ లైన్‌కు మరమ్మతులు చేయించారు. ఇంటింటా నల్లా ద్వారా తాగు నీటి సరఫరా కావడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.

హెడ్‌కానిస్టేబుల్‌కు గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ మధుకర్ గాయపడ్డాడు. మూడు రోజుల కిందట పోలీసు హెడ్‌క్వార్టర్ ముందు గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆయనకు గాయాలయ్యాయి. గురువారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఏఎస్సై మధుకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒకరి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: మైనర్ బాలికను మోసం చేసిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 17న మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన వ్యక్తి ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మైనర్ బాలికలను మోసం చేసినట్లు పేర్కొన్నారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అల్బెండజోల్ మాత్రలు పంపిణీ



ఆదిలాబాద్‌టౌన్: మాత్రలు వేస్తున్న సిబ్బంది



ఇంద్రవెల్లి: మాత్రలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ పుష్పలత

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో వనజ చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. భోజనం చేసే ముందు, మల మూత్ర విసర్జన తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని చిన్నారులకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రాధ, ఏఎన్‌ఎం తులసీ, చిన్నారులు పాల్గొన్నారు.

తాంసి: నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి వేసుకోవాలని వైస్ ఎంపీపీ రేఖ అన్నారు. పొన్నారి గ్రామంలో అంగన్ వాడీ కేంద్రంలో చిన్నారులకు మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అశోక్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

- మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాంసి వైద్యాధికారి శ్రావ్య అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి, ఎంఈవో శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను జెడ్పీటీసీ ఆర్క పుష్పలత పంపిణీ చేశారు. నులిపురుగు మాత్రలు ద్వారా రోగనిరోధక శక్తి పెరిగి రక్తహీనత, పోషకాహార లోపం, అలసట రాకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్యుడు శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయుడు రాంమోహన్, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే ప్రతీ చిన్నారికి నులిపురుగు నివారణ మాత్రలు వేయాలని వైద్య సిబ్బంది అన్నారు. మావల మండలంలోని పిట్టలవాడలో గల ప్రాథమిక పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు నులిపురుగు నివారణ మాత్రలు వేశారు. ఆరోగ్య పర్యవేక్షకుడు బొమ్మెత సుభాష్, ఆడే సురేశ్, నల్ల ఈశ్వర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు భీమ అంబయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌రూరల్: మాత్రలు వేస్తున్న సిబ్బంది



ఇచ్చోడ: కేశవపట్నం పాఠశాలలో..



బజార్‌హత్నూర్: మాత్రలు వేస్తున్న మెడికల్ ఆఫీసర్

బజార్‌హత్నూర్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శిల్ప ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, నరేశ్, ప్రకాశ్, కౌసల్యా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని కేశవపట్నంలో ప్రాథమిక పాఠశాలలో ఏఎన్‌ఎం జారుబాయి, సెకండ్ ఏఎన్‌ఎం గంగామణిల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. 19 ఏళ్ల లోపు వయస్సు ఉన్న పిల్లలు ప్రతిఒక్కరూ ఈ మాత్రలు వేసుకోవాలని కోరారు.

నేరడిగొండ: పిల్లలను నులిపురుగుల నుంచి సంరక్షించాల్సిన బాధ్యత పోషకులపై ఉందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎండీ సద్దాం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'చలో ఉట్నూర్' విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

బోథ్: చలో ఉట్నూర్ విజయవంతం చేయాలని ఆదివాసీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో మెగా స్పెషల్ డీఎస్సీ ఏర్పాటు చేయాలని కోరారు. ఐటీడీఏలో బ్యాగ్ లాక్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. జీవో నంబరు 3ను యథావిధంగా కొనసాగించాలన్నారు. ఉద్యోగస్తులకు పదోన్నతులు బదిలీలు కల్పించాలన్నారు. ఆదివాసీ సంఘాల నాయకులు, విద్యార్థులు, నిరుద్యోగ యువతీ, యువకులు మహాధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్కా బాపూరావు, రామేల్లి భోజన్న, కుర్మే రాజన్న , ఆడ హన్మంతు, సెడ్మాకి సీతారాం, నైతం సీతారాం, కనక గణేష్ పాల్గొన్నారు.

క్షణక్షణం భయం.. భయం

- చిరుత సంచారంతో ఆందోళన
- పంట పొలాలకు వెళ్లాలంటే జంకుతున్న రైతులు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆటవీశాఖ అధికారులు

తలమడుగు: మండలంలో చిరుతపులి సంచారంతో ప్రజలు భయం భయంగా గడుపుతున్నారు. ముఖ్యంగా అడవికి దగ్గరగా ఉన్న గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. భయం గుప్పిట్లో కాలం గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలకు వెళ్లాలంటనే జంకుతున్నారు. మండలంలోని కుచులాపూర్, పల్సి(కె), పల్సి(బి), కొత్తూరు, లక్ష్మింపూర్, సోనాపూర్, కొసాయి, లల్‌ఘడ గ్రామాలు అడవికి అనుకొని ఉంటాయి. ఈ గ్రామాల ప్రజలు నిత్యం అడవి మార్గం గుండానే పొలాలకు వెళ్లాల్సి ఉంటుంది. వారం రోజులుగా మండలంలోని కొత్తూరు గ్రామ శివారులో సంచరిస్తుందని మేకల మందపై దాడి చేయడంతో పశువుల కాపర్లు ఆందోళన చెందుతున్నారు. అది వెళ్లిపోయింది అనుకున్న తరుణంలో మరొక చోట దాడి చేయడంతో మరింత భయాందోళనకు గురవుతున్నారు. బుధవారం కుచులాపూర్ గ్రామానికి చెందిన ఆశన్న ఎద్దుపై చిరుత దాడి చేసి చంపి వేసింది. అలాగే కొత్తూరు సమీపంలో మేకల మందపై దాడికి యత్నించగా.. మేకల కాపర్లు అరుపులు వేయడంతో అక్కడి నుంచి పారి పోయిందని కాపారులు తెలిపారు. స్థానికులు అట వీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో చిరుత పులి జాడ కోసం వెతుకున్నారు. రైతులు పంట పొలాలకు గుంపులు గుంపులుగా వెళ్లాలని సూచిస్తున్నారు. రోజుల వరకు అటవీ ప్రాంతం వైపు వెళ్లావద్దని గ్రామ ప్రజలను అప్రమత్తం చేస్తున్నా రు. అధికారులు స్పందించి ప్రత్యేక బోన్లు ఏర్పాటు చేసి చిరుత పులిని పట్టుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బ్యాగుల పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: స్టేట్ బ్యాంక్ ఇండియా స్టాఫ్ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి తారక్‌నాథ్ వర్ధంతిని పురస్కరించుకొని విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్ ఎస్‌బీఐ బ్యాంక్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చేసిన సేవలు గుర్తింపుగా ప్రతీ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, శివకాంత్, పరమేశ్వర్, పాఠశాల ఉపాధ్యాయుడు స్వామి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఆదిలాబాద్‌టౌన్: పదోన్నతులు పొందిన ఉపాధ్యాయుల ఉత్తర్వులు జారీ చేయడంలో విద్యాశాఖ నిర్లక్ష్యం చేస్తుందని భాషాపండిత ఉపాధ్యాయులు గురువారం డీఈవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. తప్పుల తడకగా జాబితా రూపొందించిన తర్వాత సరిదిద్దుతామని చెప్పి మూడు రోజులు గడిచినా.. ఉత్తర్వులు విడుదల చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డా రు. అధికారులను అడిగితే స్పందించడం లేదని పేర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో భాషా పండితులు వివేకానంద స్వామి, పొచ్చన్న పాల్గొన్నారు.

బదిలీలు, ప్రమోషన్లు వెంటనే చేపట్టాలి

నార్నూర్: గిరిజన సంక్షేమశాఖలో సుదీర్ఘంగా పని చేస్తున్న ఉపాధ్యాయులకు, బోధనేతర సిబ్బందికి బదిలీలు, ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని టీజీయూఎస్ జిల్లా అధ్యక్షుడు ఆడే విశ్వనాథ్ డిమాండ్ చేశారు. గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో జామ్డా బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి నిరసన తెలిపారు. ఖాళీగా ఉన్న అన్ని క్యాడర్లను అర్హత కలిగిన వారితో భర్తీ చేయాలన్నారు. అదే శాఖలో గత కొన్ని ఏళ్లుగా సీఆర్టీలుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం గౌరవ రాష్ట్ర నాయకులు చౌహాన్ నెహ్రూ, జనరల్ సెక్రటరీ శివాజీ జాదవ్, ఉపాధ్యాయులు పుష్పలత, ప్రేమ్ పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మించాలని వినతి



జెడ్పీటీసీకి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

తలమడుగు: మండల కేంద్రంలోని రుయ్యాడి రైల్వే గేట్ సమీపంలో ప్రవీణ్ రెడ్డి వ్యవసాయ పొలం వద్ద కల్వర్టు నిర్మించాలని గురువారం జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డికి రైతులు వినతిపత్రం అందజేశారు. స్పందించిన గణేష్‌రెడ్డి సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి కల్వర్టు నిర్మించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తలమడుగులోని చర్చి కాలనీ వద్ద రోడ్డుకు మరమ్మతులు, కల్వర్టు నిర్మిస్తానని గ్రామస్తులకు తెలిపారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామన్నారు. త్వరలోనే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్యాణలక్ష్మి రాజేశ్వర్, రైతులు పద్మకర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నర్సారెడ్డి, వెంకన్న యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ దశలోనే..

- పనుల్లో లోపిస్తున్న నాణ్యత
- బడుల ప్రారంభంలోనే పగుళ్లు తేలుతున్న వైనం



కచ్‌కంటి పాఠశాలలో నిర్మాణ దశలో ఉన్న పనులు

ఆదిలాబాద్‌రూరల్: సర్కారు బడుల్లో మౌలిక వసతుల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా అభివృద్ధి పనులు చేపడుతోంది. పాఠశాలలు ప్రారంభానికి ముందే పనులను పూర్తి చేయాలని ఆదేశించింది. అయితే కొన్ని పాఠశాలల్లో చేపట్టిన పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో బడుల ప్రారంభ దశలోనే గోడలతో పాటు టైల్స్ పగుళ్లు తేలుతున్నాయి. నాసిరకంగా పనులు చేపట్టడంతోనే ఇలాంటి దుస్థితి నెలకొందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే పనుల బాధ్యతలను ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పజెప్పగా ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని ఆయా ప్రాంతాల్లో ఈ కమిటీలు పనులు చేపట్టేందుకు ముందుకు రాకపోవడంతో కాంట్రాక్టర్లకు అప్పగించారు. దీంతో వారు ఆలస్యంగా పనులు ప్రారంభించి, పాఠశాలలు పునఃప్రారంభం నాటికి సైతం పూర్తి చేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరికొన్ని చోట్ల పనులు చేపడుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో జరగలేదు. కొన్ని పాఠశాలల్లో చేపట్టిన పనుల్లో నాణ్యత లోపించడంతో అవి మూన్నాళ్ల ముచ్చటగానే నిలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

31 పాఠశాలల్లో..

ఆదిలాబాద్‌రూరల్ మండలంలో 31 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఈ పనులకు ప్రభుత్వం రూ.1 కోటి 5లక్షల 70వేల నిధులను కేటాయించింది. అయితే ఆయా పాఠశాలల్లో మరుగుదొడ్లు, నీరు, విద్యుత్ సౌకర్యంతో పాటు ఇతర మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. పాఠశాలలకు వేసవి సెలవులు ఉన్న సమయంలో పనులు చేపట్టి బడులు ప్రారంభానికి ముందు పూర్తి చేయాల్సి ఉంది. కొన్ని పాఠశాలల్లో పనులు పూర్తి కాగా.. మరికొన్ని పాఠశాలల్లో ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

పనుల్లో జాప్యం..

మండలంలోని కచ్‌కంటి గ్రామంలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ పనులు చేపట్టేందుకు ముందుకు రాకపోవడంతో జాప్యం జరిగింది. దీంతో అధికారులు కాంట్రాక్టర్ ద్వారా పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. కాంట్రాక్టర్ పనులను ఆలస్యంగా మొదలు పెట్టడం, పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ పనులు కొనసాగుతూనే ఉండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

80 నుంచి 90 శాతం పనులు పూర్తి

ఆదిలాబాద్‌రూరల్ మండలంలో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా 31 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి. కొన్నిచోట్ల పనులు పూర్తి కాగా, మరికొన్ని చోట్ల 80 నుంచి 90 శాతం జరగగా, అవి త్వరలోనే పూర్తి కానున్నాయి.

– జయశీల, ఎంఈవో, ఆదిలాబాద్

కాంట్రాక్టర్ పొరపాటు కాదు

మండలంలోని కచ్‌కంటి గ్రామంలోని ఎంపీయూపీఎస్ పాఠశాలల్లో ఆదర్శ కమిటీ వారు ముందుకు రాలేదు. దీంతో ఓ కాంట్రాక్టర్ ద్వారా పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నాం. అయితే అక్కడ వేసిన టైల్స్ పగుళ్లు తేలాయి. కాంట్రాక్టర్ పొరపాటు కాదు. గ్రా మస్తులే కావాలని వాటిని ధ్వంసం చేశారు. విద్యుత్ తీగలు సైతం దొంగలించారు.

– సలాఉద్దీన్, ఏఈ, పీఆర్

రోగులకు అందని వైద్యసేవలు

- బస్తీ దవాఖానాలో సమయపాలన పాటించని సిబ్బంది
- ఇబ్బంది పడుతున్న రోగులు



తేజాపూర్‌లో తాళం వేసి ఉన్న బస్తీ దవాఖానా

నేరడిగొండ: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశారు. కానీ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు వైద్య సేవలు అందడం లేదు. నేరడిగొండ మండలంలో తేజాపూర్, వడూర్, బుగ్గారం(బి), తర్నం, వాంకిడి గ్రామాల్లో బస్తీ దవాఖానాలు ఉన్నాయి. ఇందులో విధులు నిర్వర్తించే సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో రోగులకు తిప్పలు తప్పడం లేదు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సేవలు అందించాల్సిన వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం 50 మందికి పైగా వచ్చే బస్తీ దవాఖానాలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి. అయితే వారు ఇష్టారీతిన విధులు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గురువారం మధ్యాహ్నం 'సాక్షి' తేజాపూర్ గ్రామంలో గల బస్తీ దవాఖానాను సందర్శించగా అప్పటికే తాళం వేసి ఉంది. ఇలా జిల్లా అంతటా ఇదే పరిస్థితి నెలకొందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి బస్తీ దవాఖానా సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రజలరు కోరుతున్నారు.

పరామర్శ


గుడిహత్నూర్: మండలంలోని ముత్నూర్‌తండాకు చెందిన సీనియర్ నాయకుడు జాదవ్ రాంజీనాయక్ కిడ్నీ సంబంధిత వ్యాధితో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. విష యం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం ఆసుపత్రికి చేరుకొని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు.

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రానికి చెందిన ఐకేపీ ఉద్యోగి రాజలింగు ఇటీవల రోడ్డు ప్ర మాదంలో మృతి చెందగా.. కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ బాధిత కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. రాజలింగు మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వ పరంగా అందుకుంటామన్నారు.

పీజీటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ మండలంలోని బంగారుగూడ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పీజీటి (ఆంగ్లం) ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్‌లో పీజీ, బీఈడీలో ఇంగ్లీష్ మెథడాలజితో పాటు బోధనలో అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. బయోడాటా, ఫొటో, విద్యార్హతల జిరాక్స్ పత్రాలతో ఈనెల 26లోపు పాఠశాలలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. క్లాస్ డెమో, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక పూర్తి చేస్తున్నట్లు వివరించారు.

ఘనంగా యోగా వేడుకలు




యోగా ఆకారంలో విద్యార్థులు

బోథ్: మండల కేంద్రంలోని నా గభూషణం పాఠశాలలో గురువారం యోగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగాసనాలు వేశారు. ప్రతిఒక్కరూ యోగా చేయాలని ఉపాధ్యాయులు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు సరిచేయండి

బోథ్: మండలంలోని నక్కలవాడ శివారులో 25 రోజుల క్రితం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. అయితే వాటికి మరమ్మతులు చేసి సరి చేయాలని విద్యుత్ అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని రైతులు నిఖిల్, భీంరావు, ప్రకాష్, దత్తులు వాపోతున్నారు. అధికారుల నుంచి కనీస స్పందన కూడా లేదన్నారు. త్రీఫేజ్ విద్యుత్ లేనందున విత్తనాలకు నీరు ఇవ్వలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలను సరిచేయాలని కోరుతున్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి



సర్వే పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ఫణీందర్‌రావ్

జైనథ్: మిషన్ భగీరథ ఇంటింటా సర్వేను పకడ్బందీగా చేపట్టాలని డీఎల్‌పీవో ఫణీందర్ రావ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ర్వహిస్తున్న సర్వేలో పాల్గొన్నారు. సర్వే కొనసాగుతున్న తీరు, మిషన్ భగీరథ కనెక్షన్ల గురించి ఆరా తీశారు. మొత్తం 1086 కనెక్షన్లు ఉండగా.. 550 కనెక్షన్‌లకు సంబంధించిన సర్వే పూర్తి చేసినట్లు పంచాయతీ కార్యదర్శులు ముజీబ్, ప్రశాంత్ వివరించారు. ఇంకా 536 కనెక్షల సర్వే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఎల్‌పీవో ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో రవీంద్రనాథ్, పంచాయతీ కార్యదర్శులు ముజీబ్, ప్రశాంత్ ఉన్నారు.